క్లుప్తంగా

నేడు తుక్కుగూడకు మంత్రి సబిత

తుక్కుగూడ: నేడు మంత్రి సబితారెడ్డి తుక్కుగూడలో పర్యటిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూరం చెరువు వద్ద రూ.2 కోట్లతో నిర్మించే దోబీ ఘాట్ భవానికి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరై.. విజయవంతం చేయాలని కోరారు.

మంత్రికి వినతి

కందుకూరు: మండల పరిధిలోని ధన్నారంలో మల్లన్న, బీరప్ప ఆలయాల నిర్మాణాలకు గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని మంత్రి సబితారెడ్డికి ఆదివారం యాదవ, కురుమ సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 34, 35లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని తమకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘాల సభ్యులు సత్తయ్య, శ్రీరాములు, రాములు, శివశంకర్, నాగేశ్, పర్వతాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

తుక్కుగూడ: మహేశ్వరం మండలం యాదవ సంఘం అధ్యక్షుడు భిక్షపతి ఆదివారం తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మాజీ ఎంపీటీసీ రాజు, నాయకులు పాండురంగారెడ్డి, బాల్‌రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

హోలీమదర్‌లో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండల కేంద్రంలో ఉన్న హోలీ మదర్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. అనంతరం బీజేపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంచి మార్కులు, ర్యాంకులు సాధించి చదువులు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సునితా భూపాల్, ప్రిన్సిపల్ మాధవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో సమన్యాయం

జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్లా

పహాడీషరీఫ్: సీఎం కేసీఆర్ అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా అన్నారు. రాష్ట్రంలో అందరికీ సమన్యాయం అందుతోందని పేర్కొన్నారు. ఆదివారం జల్‌పల్లి గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుకు..



కాలనీవాసులతో సమావేశమైన శ్రీరాములు

హుడాకాంప్లెక్స్: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ సాయికృష్ణనగర్, క్రాంతినగర్ కాలనీ వాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ, పసుపు బోర్డు, వందేభారత్ రైళ్లలతో పాటు ఎరువుల కర్మాగారం, జాతీయ రహదారుల అభివృద్ధికి రూ. 9 లక్షల కోట్ల నిధులను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరజ్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్, ఉపేందర్‌రెడ్డి, లక్ష్మీనాథచార్యులు పాల్గొన్నారు.

నిండా నిర్లక్ష్యం!

- వ్యర్థాలన్నీ రోడ్డుపైనే
- కంపు కొడుతున్న రహదారి
- రూ. కోట్లు వెచ్చించినా ప్రయోజనం శూన్యం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



షాహిన్‌నగర్ ప్రధాన రహదారి పక్కన చెత్త

పహాడీషరీఫ్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు జల్‌పల్లి మున్సిపాలిటీ పరిస్థితి తయారైంది. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నా.. అధికారుల అలసత్వంతో మూన్నాళ్లకే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అధికారులు నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. రూ.8 కోట్లు వెచ్చించి ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ వరకు రెండేళ్ల క్రితమే వేసిన రహదారి మురికికూపంగా మారింది. ఎర్రకుంట చౌరస్తాలో బస్తీల నుంచి వస్తున్న మురుగునీరు రోడ్డుపై పారడంతో రహదారి గుంతలమయంగా మారింది. దీనికితోడు స్థానికులు రోడ్డుపైనే నిర్మాణ వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

రోడ్డంతా దుర్గంధం

షాహిన్‌నగర్‌లోని హుడా పాఠశాల ప్రాంతంలోని రహదారిపై ఏడాది పొడవునా మురుగునీరు పారుతుండడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. చుట్టుపక్కల ముక్కుపూటలదిరే దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడే పాఠశాలు, ఆస్పత్రులు ఉండడంతో విద్యార్థులు, ప్రజలు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది.

నిర్వహణ లోపం

షాహిన్‌నగర్‌లోని జేజీఆర్ గార్డెన్ సమీపంలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోతుండడంతో వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో స్థానికులు చెత్తను రోడ్డుపైనే డంప్ చేస్తున్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా.. మళ్లీ పేరుకుపోతుంది.

చర్యలు తీసుకోవాలి



ఎర్రకుంట చౌరస్తాలో రోడ్డుపై గుంతలు ఏర్పడి ఏడాది కావొస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారే ఇలా ఉంటే.. అంతర్గత బస్తీల పరిస్థితి ఘోరంగా ఉంది. మురుగునీటి నుంచి వస్తున్న దుర్వాసనతో అనారోగ్యాలకు గురవుతున్నాం. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలి. – ఖాలేద్, ఎర్రకుంట

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



ఎక్సైజ్ శాఖ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సబితారెడ్డి

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- త్వరలో కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన
- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి, అధునాతనమైన భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం ఎస్టీ హాస్టల్ పక్కన ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి స్థలం కేటాయించి.. రూ.22 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణ పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో భవిష్యత్తు తరాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి అన్ని సౌకర్యాలతో అధునాతమైన భవనాలను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. మహేశ్వరం మన్సాన్‌పల్లి, రావిర్యాల, కుర్మల్‌గూడలో అన్ని కుల సంఘాలకు స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. త్వరలో కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. రావిర్యాల, మహేశ్వరంలో భారీ పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సుపరిండెంట్ రవీందర్ రావు, అసిస్టెంట్ సుపరిండెంట్ హన్మంత్‌రావు, మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్, హన్మంత్ నాయక్, ఇన్‌చార్జీ ఎంపీపీ సునితా నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం తదితరులు పలువురు పాల్గొన్నారు.

అవ్వా ఆసరా పింఛన్ వస్తుందా?

అవ్వా ఆసరా పింఛన్ వస్తుందా? అందరూ బాగున్నారా అని ఆప్యాయంగా వృద్ధులను పలకరించి వారితో కాసేపు మంత్రి సబితారెడ్డి ముచ్చటించారు. పింఛన్లు ఇస్తున్నందుకు మంత్రికి, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి మంత్రి వచ్చిన సందర్భంలో సంఘటన చోటుచేసుకుంది.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నానని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ పెద్ద చెరువు వద్ద వేస్తున్న హ్యూమ్ పైప్‌లైన్ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.4 కోట్లతో పెద్ద చెరువును సుందరీకరిస్తున్నామని తెలిపారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేశానన్నారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని మాస్టర్‌మైండ్ ఎడ్యూకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను గుర్తించి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పారిజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్రకు వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి, కాలేజ్ చైర్మన్ జగన్మోహన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పుష్పాగార్డెన్స్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు. 11కేవీ విద్యుత్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకం నేడే

కందుకూరు: మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం అనే పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాచులూరు సర్పంచ్ శ్రీనివాస్‌చారి ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న నాటకాన్ని విజయవంతం చేయాలని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ భిక్షపతి కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పంచాయితీ రాజ్ టీచర్స్ కాలనీ ఫేజ్-1 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్, రమాకాంత్‌రెడ్డి, కోశాధికారిగా నర్సింహారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రవినాయక్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీకి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రకటించారు.

ఆటలతో ఆత్మవిశ్వాసం

కార్పొరేటర్ దీపిక

బడంగ్‌పేట్: ఆటలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ దీపిక అన్నారు. హిట్‌మాన్ క్రికెట్ మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

బాలాపూర్‌లో 'మేరా మిట్టి, మేరా దేశ్'

బడంగ్‌పేట్: బాలాపూర్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మేరా మిట్టి, మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బాలాపూర్ ప్రజల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సంపత్‌రెడ్డి, అరవింద్, శ్రీశైలం, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



బాలాపూర్‌లో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కందుకూరు: కృష్ణా జలాల పంపకాల కోసం ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చినందుకు బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, కొత్తగూడ సర్పంచ్ మల్లారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, జిల్లా నాయకులు సత్తయ్య, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సస్యరక్షణతో అధిక దిగుబడి



పత్తి సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామంలో ఎనుమల మల్లారెడ్డి వ్యవసాయ పొలంలో ఆదివారం ఆమనగల్లు పట్టణానికి చెందిన సూర్య అగ్రిషాప్ మరియు రాశి సీడ్స్ ఆధ్వర్యంలో పత్తిపంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిపంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు, సాగుపై అవగాహన కల్పించారు. ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రాశి సీడ్స్ ఆర్ఎం ప్రసాద్ వివరించారు. పత్తిపంట సాగులో మెలకువలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బ్రహ్మయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసులు, మధుసూదన్, సురేశ్ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

మండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్



బండ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ప్రతి గ్రామంలో మత్స్యకారుల సొసైటీలను ఏర్పాటు చేసుకోవాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో తలకొండపల్లి గ్రామ నూతన మత్స్యకార సొసైటీ కమిటీని ఇటీవల ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పిలుపు మేరకు నూతన మత్స్యకారుల సొసైటీ సభ్యులు హైదరాబాద్‌లో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సొసైటీ సభ్యుల రిజిస్ట్రేషన్ పత్రాలను బండప్రకాశ్ వారికి అందజేశారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తగిన సహాయ సహకారాలుంటాయని బండ ప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహ, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య, రొయ్యల యాదయ్య, జంగయ్య, శ్రీశైలం, రామాంజనేయులు, లక్ష్మయ్య, పోచయ్య, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల వెంకటేశ్‌కు సన్మానం

ఆమనగల్లు: మిషన్ భగీరథ పథకం వైస్ చైర్మన్‌గా నియమితులైన తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను ఆదివారం ఆమనగల్లు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఉప్పల వెంకటేశ్ నివాసంలో ఆమనగల్లు బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటేశ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, కిరణ్, జగన్, రాములు, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

రావిచేడ్ ఎంపీటీసీ ఆధ్వర్యంలో..

కడ్తాల్: మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా నియమితులైన తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను రావిచేడ్ ఎంపీటీసీ గోపాల్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు.



ఆమనగల్లు: ఉప్పలను సత్కరిస్తున్న నాయకులు

సీఎం కేసీఆర్ చైర్మన్‌గా ఉన్న మిషన్ భగీరథ పథకానికి వైస్ చైర్మన్‌గా ఉప్పల వెంకటేశ్‌కి స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, నాయకులు రవి కుమార్, శ్రీశైలంగౌడ్, శ్రీశైలంయాదవ్, రమేశ్, రాజు, ఆంజనేయులు, మహేశ్, సునీల్ ఉన్నారు.

జేడీ కార్యాలయ ముట్టడికి తరలిరండి

- గొర్రె–మేకల పెంపకందారుల సంఘం

తలకొండపల్లి: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని పశు సంవర్ధక శాఖ జేడీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్నికి గొర్ల పెంపకందారులు తరలిరావాలని ఆ సంఘం మండల కార్యదర్శి పెంటయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 1,611 యూనిట్లుండగా, 2018, 2023 సంవత్సరాల్లో కలిసి రాష్ట్ర ప్రభుత్వం 865 యూనిట్లకే గొర్రెలను పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఇంకా 746 యూనిట్లకు గొర్రెలను పంపిణీ చేయలేదని ఆయన వాపోయారు. కేసీఆర్ ప్రభుత్వం గొల్ల, కురుమలను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పశు సంవర్ధక శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని చెప్పారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల గొల్ల, కరుమలు, ప్రతి ఇంటికి ఒక్కరు చొప్పున తరలి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిన్న మల్లయ్య, ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, సహాయ కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఆమనగల్లులో ఆశ కార్యకర్తల వంటావార్పు

ఆమనగల్లు: ఆశ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో ఆదివారం వారు వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సల్మాబీబీ, మంజుల, విజయ, వసంత, చంద్రకళ, వరలక్ష్మి, లక్ష్మమ్మ, సుశీల, పార్వతి, రోహిణి, కుమారి, పద్మ, రజిత, ఈశ్వరమ్మ, శమంత, బాగ్యమ్మ, అలివేలు, కవిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- నరేంద్ర మోదీ చిత్రపటాలకు బీజేపీ నేతల క్షీరాభిషేకం



ఆమనగల్లు: నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆచారి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జాతీయ నాయకులు ఆచారి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆచారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి పసుపుబోర్డు, గిరిజన యూనివర్సిటీ ప్రకటించిన ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు రవిరాథోడ్, పద్మ, ప్రశాంత్, శ్రీను, విష్ణువర్ధన్, నర్సింహారెడ్డి, మన్యానాయక్, వెంకటేశ్, సాయిలాల్, కాసుల వెంకటేశ్, పెద్దయ్యయాదవ్, వెంకటేశ్‌గౌడ్, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం..

మంచాల: దేశ సమగ్ర అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలో మండల బీజేపీ ఇన్‌చార్జి జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల బూత్ స్వశక్తి కరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదే విధంగా మంచాల చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ ప్రకటనలపై హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నారాయణ్ యాదవ్, రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, భాషయ్య, మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాండు, నర్సింహ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి యాచారం మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో పసుపుబోర్డు, గిరిజన యూనివర్సిటీ, రూ.వేలాది కోట్ల నిధులతో పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మోదీకి అభినందనలు తెలుపుతూ బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు రమేష్, శాంతి కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, భాష, వేణు, కృష్ణ, రాజు, హరికిషన్, మల్లేష్, గణేష్, మహేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.